మూడు తరాల స్వర నీరాజనం

మూడు గళాలు..ఒకటే స్వరం!

- టీటీడీ నాద నీరాజనంలో మూడు తరాల సంగీత కచేరీ
- తెనాలి వారసుల సంగీత ప్రతిభకు నిదర్శనం


టీటీడీ నాదనీరాజనంలో తాడేపల్లి లోకనాథశర్మ, శ్రీకృష్ణ, ప్రద్యుమ్నసాగర్

తెనాలి: మధ్యస్థమైన శరీరం, నుదుటున వెడల్పాటి విభూది పట్టీలు, తెల్లగా పెరిగిన గడ్డం, ముఖంనిండా అలుముకున్న చిరునవ్వుతో చూడగానే ఏ సంస్కృత పండితుడో అనిపిస్తారాయన. ఆయన వయసు 79 ఏళ్లు.. ఇప్పటికీ గంటలకొద్దీ స్వరరాగ గంగలో సభికులను ముంచెత్తుతారంటే అతిశయోక్తి కాదు. కొద్దిరోజుల క్రితం తన కుమారుడు శ్రీకృష్ణ, మనుమడు ప్రద్యుమ్న సాగర్‌తో కలిసి తిరుమలలో టీటీడీ 'నాదనీరాజనం'లో సంగీత కచేరినిచ్చి ఆశేష అభిమానులను ఆనందపరవశంలో ముంచెత్తారు. మూడుతరాలకు చెందిన ఆయా గళాలు ఒక్కటిగా శ్రీవారి సన్నిధిలో స్వరార్చన చేయటం విశేషం.

సంగీత పరిశోధనలో పీహెచ్‌డీ

ప్రముఖ పండితుడు, వాగ్గేయకారుడు బ్రహ్మశ్రీ తాడేపల్లి వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి కుమారుడు లోకనాథశర్మ. కళల తెనాలిలో 1945 జూన్ 8న జన్మించారు. వారసత్వంగా వచ్చిన సంగీత కళను మహామహుల వద్ద శిక్షణలో మెరుగుపర్చుకున్నారు. సంగీత పరిశోధనలో పీహెచ్‌డీ చేశారు. కేంద్ర ప్రభుత్వ టెక్స్‌టైల్స్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సంగీత వాద్యాల అభివృద్ధి కేంద్రమైన 'సంగీత విద్యాలయ' డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. రీజనల్ డిజైన్, టెక్నికల్ డెవలప్‌మెంట్ సెంటర్ డెప్యూటీ డైరెక్టర్‌గా 2005 రిటైరయ్యారు. ఉన్నతోద్యోగంలో ఉన్నా దేశంలోని నగరాలు, పట్టణాల్లో కచేరీలు చేశారు. పురందరదాసు, అన్నమయ్య, రామదాసు కీర్తనాల్లో కొన్నిటికీ బాణీలు కట్టారు. తంబూరా ఆకారాన్ని మార్చి కుండ లేకుండా వట్టి వెదురుబద్దలతో 'వంశీ శ్రోతి', కలపతో 'శ్రుతిచండి' అనే రెండు కొత్త వాయిద్యాలను తయారుచేశారు.

శాస్త్రీయ సంగీత ప్రచారంలో..

ఆకాశవాణిలో ఏ గ్రేడ్ ఆర్టిస్ట్ అయిన లోకనాథ శర్మ, శాస్త్రీయ సంగీత ప్రచారంలో భాగంగా ఎన్నో ఉన్నత బాధ్యతలూ నిర్వర్తించారు. సమాచార, ప్రసార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలోని సాంగ్ అండ్ డ్రామా డివిజను, ఆర్మ్‌డ్ ఫోర్సెస్, ఎంటర్‌టైన్‌మెంట్ వింగ్ స్టాఫ్‌మెంబరుగా చేశారు. సికింద్రాబాద్‌లోని ప్రభుత్వ సంగీత, నృత్యకళాశాలలో అధ్యాపకుడిగా ఎనిమిదేళ్లు చేశారు. ఉమ్మడి ఏపీ, తమిళనాడు, ఢిల్లీలోని వివిధ యూనివర్సిటీలకు సంగీతంలో డిగ్రీ, పీజీ విద్యార్థులకు పరీక్ష ప్రశ్నాపత్రాల రూపకల్పన చేశారు. ప్రాక్టికల్స్ పరీక్షాధికారిగానూ వ్యవహరించారు. మద్రాస్ యూనివర్సిటీలో భారతీయ సంగీతం విభాగం బోర్డు సభ్యుడు. అన్నామలై యూనివర్సిటీ, శ్రీలంకలోని జాఫ్నా యూనివర్సిటీ పీహెచ్‌డీ విద్యార్థులకు ఎక్స్‌టెర్నల్ గైడ్‌గానూ ఉన్నారు. సంగీత విద్యలో డాక్టర్ ఎస్.రాధాకృష్ణన్‌తో సహా ఎందరో ప్రముఖులనుంచి బహుమతులను అందుకున్నారు. తమిళనాడు ప్రభుత్వం నుంచి 'కలైమామణి' గౌరవాన్ని స్వీకరించారు.

విశ్వశాంతి కోసం కచేరీలు..

ఇప్పటికీ విశ్వశాంతిని కోరుతూ సంగీత కచేరీలు చేస్తున్నారు. గంభీర గాత్రం.. రాగాల మీద సాధికారత.. స్వరంలో స్పష్టత, పరిధి దాటని శృతి, సాహిత్యంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ తాదాత్మ్య భావనతో సాగే కృతి...ఇవన్నీ ఆయన కచేరీ లక్షణాలు...సంగీతంపై ఎనలేని మమకారం ఆయన్ను సంగీత విద్వన్మణిగా తీర్చిదిద్దింది. తరంగాలు, జావళీలు, సంకీర్తనలు, కీర్తనలు...ఏవైనా సరే ఆయన గాత్రంలో ఒద్దికగా చేరిపోతాయి. సంగీతాభిమానులను అలౌకికమైన స్వరసాగరంలో ఓలలాడిస్తాయి. 'ఇది ఓ సంగీత తపస్సు' అంటారా రాగతపస్వి లోకనాథశర్మ.

అలరించిన వారసత్వ గళం

తన కళకు వారసత్వ గళాలు చేరటం మరో ప్రత్యేకత! ఆయనకిద్దరు కుమారులు. పెద్దకుమారుడు శ్రీధర్ ఒక ఎన్జీవోలో చేస్తున్నారు. రెండో కొడుకు శ్రీకృష్ణ ఎంఏ (సంగీతం) చేశారు. సంగీతమే ఆయనకు ప్రపంచం. ఆయన భార్య రుక్మిణి కూడా పద్మావతి మహిళా యూనివర్సిటీలో సంగీతంలో ఎంఏ చేశారు. ఎంబీఏ చేసి, హిందీలోనూ ఉన్నతకోర్సు పూర్తిచేశారు. భార్యాభర్తలు ఇరువురు సంగీత శిక్షణనిస్తున్నారు. వీరి కుమారుడు ప్రద్యుమ్న సాగర్. ఫుడ్ టెక్నాలజీలో బీటెక్ చేస్తున్నాడు. ప్రస్తుతం మూడో సంవత్సరం. కీబోర్డు సాధన చేస్తూనే అమ్మానాన్నల వద్ద సంగీత శిక్షణ తీసుకున్నాడు. సంగీతంలో ఎదిగిన వచ్చిన యువగళంతో కలిసి లోకనాథశర్మ, ఆయన తనయుడు శ్రీకృష్ణ సంగీత కచేరీని ఇవ్వాలని భావించారు. అనుకున్నదే తడవుగా టీటీడీ నాదనీరాజనం ఆహ్వానం పలికింది. గత నెల 31వ తేదీన వీరి కచేరి భక్తి ఛానల్‌లో ప్రత్యక్ష ప్రసారంతో సంగీతాభిమానులకు వీనులవిందు చేసింది.

తెలుగుభాషకు సీపీ బ్రౌన్ సేవ అజరామరం



తెనాలి: పట్టణ నాజరుపేటలోని కమలశ్రీ నిలయంలో ఆదివారం సాయంత్రం శ్రీ శ్రీ కళావేదిక, గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తెలుగు భాషాపోషకుడు, తెలుగు వెలుగుల సూరీడు చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్ (సీపీ బ్రౌన్) జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీశ్రీ కళావేదిక, జిల్లా కమిటీ అధ్యక్షుడు రంగిశెట్టి రమేష్ అధ్యక్షత వహించారు. తెలుగు తన మాతృభాష కానప్పటికీ, తెలుగు భాష గొప్పదనాన్ని గుర్తించి, తెలుగు తియ్యందనాలను గ్రోల తలంచి, తెలుగు భాషావికాసానికై తన జీతాన్ని, జీవితాన్ని అంకితం చేసిన త్యాగశీలి, ధన్యజీవి సీపీ బ్రౌన్ అని కొనియాడారు. జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి, ఆళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు భాషావ్యాప్తికి అలుపెరగక పోరాడిన తెలుగు భాషా ప్రేమికుడు చార్లెస్ ఫిలిప్స్ బ్రౌన్ అని, తన సొంత ధనాన్ని వెచ్చించి, కవి పండితులను పోషించి, తెలుగులో పుస్తకాలు ప్రచురించి ఉచితంగా పంచారని చెప్పారు. తెలుగు భాషా విస్తృత వ్యాప్తికి ఆయన చూపిన బాటలో నడవమే మన ముందున్న కర్తవ్యమన్నారు. ఇదే వేదికపై 'తెలుగు భాషా వికాసం... కవుల కర్తవ్యం' అనే అంశంపై నిర్వహించిన కవి సమ్మేళనంలో స్థానిక సాహితీవేత్తలు ప్రముఖ పద్యకవి విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్, గాయకుడు, కళాకారుడు కొప్పరాజు విజయ సారధిబాబు, ప్రముఖ బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీమ్ జాని, చందు సూర్య, ఈమని ప్రేమకుమార్, పాతూరి సుబ్రహ్మణ్యం కవి, ఎంవీ రఘునాథరావు, ఆళ్ల సుజాత, మానేపల్లి నరసింహాచారి తదితరులు తమ స్వీయకవితలును గానం చేశారు. తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల సమర్పించారు.

క్లుప్తంగా

వైభవంగా వార్షిక పడిపూజ మహోత్సవం

తెనాలి: పట్టణంలోని సుల్తానాబాద్‌లో, కనకదుర్గ అమ్మవారిగుడి వద్ద, చెరుకూరి రమేష్ ఇంటి ఆవరణలో, 22వ వార్షిక అయ్యపస్వామి పడిపూజా మహోత్సవం వైభవంగా నిర్వహించారు. గత 22 సంవత్సరాలు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అయ్యప్ప స్వాములకు, గురుస్వాములకు, భవానీలకు, శివ స్వాములకు, వేద పండితులకు, సద్ది(భోజనం)ఏర్పాట్లు చేశామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బాషా, శ్రీరాం షైల్స్ రామకృష్ణ, నాగేశ్వరరావు, డి.కోటేశ్వరరావు, ధనశేఖర్, శ్రీను, పలువురు అయ్యప్పలు, భవానిలు, శివస్వాములు, భక్తులు పాల్గొన్నారు.

షుగర్ వ్యాధిపై అవగాహన

తెనాలి: వాకర్స్‌క్లబ్, తెనాలి-2 సమావేశం ఆదివారం సాయంత్రం చెంచుపేటలో జరిగింది. క్లబ్ అధ్యక్షుడు వేజళ్ల ఉమామహేశ్వర్ అధ్యక్షత వహించారు. ప్రముఖ డయాబెటిస్ వైద్య నిపుణుడు ఎస్‌వీ కృష్ణారావు షుగర్‌వ్యాధి సభ్యులకు అవగాహన కల్పించారు. వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సభ్యుల సందేహాలకు సమాధానాలిచ్చారు. డాక్టర్ ఎస్‌వీ కృష్ణారావును వాకర్స్ క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యవర్గసభ్యులు జి.మురహరిరావు, ఆర్.ఆనందరావు, భుజంగరావు, కోగంటి వీరరాఘవయ్య, కోగంటి అంజిబాబు , సత్యనారాయణ రాజు, గుమ్మడి నారాయణరావు, రావి సుబ్బారావు, దేవాభక్తుని ఉమామహేశ్వరరావు, తుమ్మల సత్యనారాయణ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

రోటరీ ఆధ్వర్యంలో రక్తనాళాల వైద్యశిబిరం



తెనాలి: రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం, ఏషియన్ వాస్క్యులర్ హాస్పటల్ ఆధ్వర్యంలో తెనాలి ఆర్టీసీ బస్టాండ్ ఔట్ గేట్ ఎదురుగా గల ఈగల్ రెస్టారెంట్‌లో ఆదివారం ఉచిత రక్తనాళాల వైద్య శిబిరం నిర్వహించారు. మధుమేహం కలిగినవారికి, రక్తనాళాల వాపులు ఉన్నవారికి కాళ్లు మొద్దుబారటం, వాపులు, వెరికోస్ ఉన్న వారికి అవసరమైన పరీక్షలను ఉచితంగా చేశారు. తగిన వైద్య సలహాలనిచ్చి, అవసరమైన మందులను తెలియజేశారు. ఏషియన్ వాస్క్యులర్ హాస్పిటల్ సిబ్బంది డాక్టర్ అనిల్, టెక్నీషియన్ సాయితేజ, మేనేజర్ రాడపాక కుమార్ పరీక్షలు చేశారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు మాట్లాడుతూ తెనాలి పరిసర ప్రాంతంలో నరాలు వ్యాధులతో బాధపడుతున్న వారికి రోటరీ క్లబ్ తరపున ఈ పరీక్షలు నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, ఇంటర్ క్లబ్ రిలేషన్ జోనల్ చైర్మన్ ఈదర వెంకట పూర్ణచంద్, ఫౌండేషన్ జోనల్ చైర్మన్ గుత్తా వెంకటరత్నం, డయాగ్నస్టిక్స్ అండ్ హైజాన్ జోనల్ చైర్మన్ కన్నెగంటి మురళీకృష్ణ, జీవీ నారాయణ, జాస్తి నరేంద్ర, కాకుమాను ఉపేంద్ర, కేవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు,

జమిలీ ఎన్నికలపై త్వరలో రౌండ్‌టేబుల్ సమావేశం

ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక

తెనాలి: ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక గుంటూరు జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక దేవీచౌక్‌లోని ప్రజాసంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగింది. ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు వింతా వేణుగోపాలరెడ్డి అధ్యక్షత వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టి రామకృష్ణ, జిల్లా కోశాధికారి దివ్వెల ఏడుకొండలు, ఉపాధ్యక్షుడు భీమవరపు బ్రహ్మానందరెడ్డి, నన్నెపాగ ప్రశాంతి హాజరయ్యారు. కేంద్రప్రభుత్వం ముందుకు తీసుకొస్తున్న జమిలి ఎన్నికల విషయంపై అన్ని ప్రజాసంఘాలను కలుపుకొని రౌండ్‌టేబుల్ సమావేశాన్ని త్వరలో నిర్వహించాలని జిల్లా కమిటీ తీర్మానించింది. ఇదే సమావేశంలో ఐక్యవేదిక తెనాలి మండల నూతన కమిటీని ఏర్పాటుచేశారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా తోటకూర శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా నాయుడుపాటి రాజేష్, కోశాధికారిగా సుద్దపల్లి పృథ్వీరాజ్‌ను ఎన్నుకున్నారు. ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి యండ్రపాటి అశోక్‌కుమార్, అభ్యుదయవాది కనపర్తి బెన్‌హర్, వివిధ విభాగాలకు చెందిన రావూరి శివకృష్ణ, వై.రమేష్ బాబు, ప్రసాద్, సీపీఎం నేత షేక్ హుస్సేన్‌వలి, హిందూ చైతన్యవేదిక బాపట్ల జిల్లా అధ్యక్షుడు పుల్లగంటి శ్రీనివాసరావు, ఆదిత్య, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

దివంగత కళాకారులకు నివాళి

తెనాలి: ఇటీవల మృతిచెందిన కొల్లిపర మండల గ్రామం తూములూరుకు చెందిన మున్నంగి జగన్‌కుమార్, ప్రముఖ రంగస్థల, సినీనటి పంతుల జయవాణి సంస్మరణను ఆదివారం సాయంత్రం స్థానిక రంగస్థల కళాకారుల సంఘ భవనంలో నిర్వహించారు. పట్టణ రంగస్థల కళాకారుల సంగం ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి అధ్యక్షత వహించారు. సంఘ నాయకులు గరికపాటి సుబ్బారావు, ఆరాధ్యుల కోటేశ్వరరావు, ఆరాధ్యుల ఆదినారాయణ, బెజ్జంకి నాగమణి తదితరులు జగన్‌కుమార్, జయవాణిల కళాసేవను సోదాహరణంగా వివరించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించారు.

ఉత్సాహంగా వన సమారాధన

తెనాలి: తెనాలి-నారాకోడూరు రోడ్డులోని వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో ఆదివారం చంద్రవంశ క్షత్రియ యాదవ రాజుల 13వ వన సమారాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు దంపతులు పాల్గొని శ్రీకృష్ణ భగవానుడికి పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్నం వరకూ పలు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. పట్టణానికి చెందిన యువనర్తకి, నృత్యగురువు ఆరాధ్యుల తేజస్వి ప్రఖ్య బృందం కూచిపూడి నృత్యాంశాలను ప్రదర్శించగా, దానబోయిన అప్పారావు బృందం కోలాటం ప్రదర్శించారు. అనంతరం చిన్నారుల కోలాట నృత్యప్రదర్శనలు, భరతనాట్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ రంగాల్లో ఖ్యాతిగడించిన ప్రముఖులను కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్తీక వనసమారాధనకు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యాదవ సంఘీయులు కుటుంబసమేతంగా తరలివచ్చారు. మధ్యాహ్నం నుంచి భారీ ఎత్తున వనభోజనాలు నిర్వహించారు. యాదవ ప్రముఖులు ఆవుల మురళీకృష్ణ యాదవ్, తాడిబోయిన రమేష్, కుర్రా సుజాత, మేడిబోయిన గంగాయాదవ్, డాక్టర్ తాడిబోయిన అఖిలేష్, తాడిబోయిన శ్రీనివాసరావు, తాడిబోయిన హరిప్రసాద్, జాతీయ సమసమాజ పార్టీ రాష్ట్ర నేత రామచంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


యాదవ ప్రముఖులకు సత్కారం

వేదిక్ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో...

తెనాలి: స్థానిక నాజరుపేట అనుగోలువారి వీధిలోని విద్యా శంకర భారతి నృసింహ సదనంలో ఆదివారం వేదిక్ బ్రాహ్మణ సమాఖ్య వార్షిక కార్తిక సమారాధన వైభవంగా జరిగింది. సమాఖ్య అధ్యక్షుడు అమ్మణ్ణి సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి, కోశాధికారి చుండూరు తిరుమలరావు పర్యవేక్షణలో ఉదయం గోపూజ నిర్వహించారు. తదనంతరం లక్ష్మీ ధాత్రి పూజ, ఈశ్వరునికి ఏకాదశ రుద్రాభిషేకం జరిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని లలిత, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ చేశారు. కార్తిక సమారాధనలో పట్టణ, పరిసర గ్రామాలకు చెందిన బ్రాహ్మణ కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నాయి. గౌరవాధ్యక్షులు భాగవతుల కామేశ్వరరావు, ఉపాధ్యక్షులు ఆమంచి సీతారామాంజనేయశాస్త్రి, కేవీ సుబ్రహ్మణ్యం, మేడూరు శ్రీనివాసమూర్తి, సంయుక్త కార్యదర్శి మేళ్లచెరువు అనిల్ కుమార్, టి.ఆంజనేయులు, డాక్టర్ నారాయణం వేణుగోపాల్, తాడేపల్లి నాగ సుబ్రహ్మణ్యం, ఎల్లాప్రగడ పద్మజ, నందివెలుగు విజయసారథి, పీవీఆర్ హెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సామూహిక వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

తెనాలి: పట్టణ బోసురోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వాసవి యూత్ 12వ వార్షికోత్సవం సందర్భంగా రమాసహిత వీరవెంకట సత్యనారాయణ వ్రతాన్ని దంపతులు భక్తిశ్రద్ధలతో చేశారు. మొత్తం 180 మంది దంపతులు స్వామివారి వ్రతాన్ని ఆచరించారు. వ్రతం అనంతరం కార్తిక వనసమారాధనను సందడిగా నిర్వహించారు. వాసవి యూత్‌కు చెందిన కనుమర్లపూడి శ్రీనివాస్, మాజేటి బదరి కిరణ్ కుమార్, చీమకుర్తి సతీష్, నాళం రజనికుమార్, కొప్పురావూరి హరికిషోర్, ఉప్పల కిషోర్ తదితరులు పర్యవేక్షించారు

సామూహిక సత్యదేవ వ్రతాలు

తెనాలి: పవిత్ర కార్తిక మాసాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం, వైకుంఠపురంలో రమాసహిత సత్యదేవ వ్రతమహోత్సవాలను ఆదివారం భక్తి పూర్వకంగా జరిపారు. కార్తికమాసంలో వరుసగా ప్రతి ఆదివారం వ్రత మహోత్సవాలు ఏటా నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీగా తెలిసిందే. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం నుంచి జరిగిన వ్రతాల్లో 151 మంది దంపతులు పాల్గొన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కుంభం సాయిబాబు నేతృత్వంలో దేవస్థానంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు భక్తులతో వ్రతాలను శాస్త్రోక్తంగా జరిపించారు. స్వామివారికి ఉదయం నుంచి విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. కార్తికమాసం హరిహరాదులకు ఎంతో ప్రీతిపాత్రమైందని ఈ మాసంలో సత్యనారాయణ వ్రతాలు జరిపించుకోవడం ఎంతో శుభప్రదమని అధికారులు తెలిపారు. వ్రత మహోత్సవాల్లో పాల్గొనదలచిన దంపతులు రూ.1000 చెల్లించి తమ పేర్లు, గోత్రం నమోదు చేయించుకోవాలని ఈఓ అనుపమ తెలియజేశారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు కురగంటి సునీత రవిశంకర్, మావులూరి శ్రీనివాస్, దేవరకొండ వెంకట రమణ శంకరరావు, ఎక్స్ అఫీషియో సభ్యుడు అళహరి రవికుమార్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.


స్వామివార్ల చిత్రపటాల వద్ద చైర్మన్ సాయిబాబు, ఈఓ అనుపమ


సామూహిక వ్రతాల్లో దంపతులు

ఒంటరి వృద్ధులకు అన్నదానమే లక్ష్యం

కొల్లిపర: గ్రామంలోని ఒంటరి వృద్ధులకు అన్నదానం చేయటమే లక్ష్యంగా ఆపన్నహస్తం ఫౌండేషన్ పనిచేస్తుందని ఫౌండేషన్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి అన్నారు. ఆదివారం గుదిబండివారి పాలెంలో కల్యాణ మండపంలో ఆపన్నహస్తం ఫౌండేషన్ ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒంటరి వృద్ధులకు నూతన వస్త్రాలు అందజేశారు. అనంతరం సమావేశంలో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వృద్ధాప్యంలో ఎవరూ లేకుండా జీవిస్తున్న వారిని ఆదుకోవాలనే సంకల్పంతో కొల్లిపర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1981-82 బ్యాచ్ పదో తరగతి విద్యార్థుల ఆలోచనతో ఈ ఫౌండేషన్ స్థాపించటం జరిగిందన్నారు. ఫౌండేషన్ ప్రధాన లక్ష్యం 100 మంది నిరుపేద వృద్ధులకు నిత్యం ఇంటికి వెళ్ళి క్యారేజీల ద్వారా అన్నదానం చేయటమే అన్నారు. రానున్న రోజులల్లో ఫౌండేషన్ ద్వారా వృద్ధాశ్రమం నిర్మించాలని కమిటీ సభ్యులు అనుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు గాది చంద్రశేఖరరెడ్డి, చీడేపూడి సురేష్ మోహన్‌రెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ జొన్నల సాంబిరెడ్డి, ఎన్.సుబ్బయ్యశర్మ, రిటైర్డ్ ఎంఈఓ అరిమండ బసవ కుటుంబ రెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం కొల్లి సురారెడ్డి, ఈదా సాంబిరెడ్డి, కమిటీ సభ్యులు కొల్లి రాఘవరెడ్డి, అవుతు సాంబిరెడ్డి, అరిమండ బేబి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఫౌండేషన్ కమిటీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి

'కాకతీయ' సొసైటీ నూతన భవనం ప్రారంభం

తెనాలి: తెనాలిలోని ది కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ అంగలకుదురు శాఖ నూతన భవన ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంగలకుదురు గ్రామంలోని మెయిన్‌రోడ్డులో వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం జెండాచెట్టు వద్ద సొసైటీ పదో శాఖ నూతన భవనాన్ని బీజేపీ రాష్ట్ర నాయకురాలు యడ్లపాటి స్వరూపరాణి ప్రారంభించారు. సొసైటీ కౌంటర్‌ను ప్రముఖ ఆడిటరు హరిబాబు, స్ట్రాంగ్‌రూమ్‌ను రోటరీ ప్రముఖుడు ఈదర వెంకట పూర్ణచంద్ ప్రారంభించారు. ప్రారంభసభకు సొసైటీ చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు అధ్యక్షత వహించారు. తెనాలిలోని సొసైటీకి తొలిశాఖ అంగలకుదురు శాఖ కాగా, ప్రస్తుతం సొసైటీ పది శాఖలతో నడుస్తోందని లక్ష్మీకాంతారావు గుర్తుచేశారు. అంగలకుదురు శాఖకు నూతన భవనంతో మొత్తం పది శాఖల్లో అయిదింటికి సొంత భవనాలు కలగివున్నట్టుగా తెలియజేశారు. సొసైటీకి గల పదిశాఖల్లో 70 మంది సిబ్బందికి ఉపాధి కల్పించినట్టు తెలిపారు. సభ్యులు, ఖాతాదారుల ఆదరణతో సొసైటీ దినదినప్రవర్ధమానంగా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. సొసైటీ అభివృద్ధికి పాలకవర్గం నిబద్ధత, సిబ్బంది సహకారం ముఖ్యకారణంగా యడ్లపాటి స్వరూపరాణి, ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు చెప్పారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ అధ్యక్షుడు మారౌతు సీతారామయ్య, మాజీ ఎంపీపీలు మైనేని రత్నప్రసాద్, కేసన కోటేశ్వరరావు, సూర్యదేవర వెంకట్రావు, ప్రముఖ న్యాయవాది వెలినేని రాఘవయ్య, జెట్టి రేణుక , సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు. తొలుత సొసైటీ వ్యవస్థాపకుడు దావులూరి సోమశేఖరరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు, డైరెక్టర్లు జి.చంద్రమౌళి, దావులూరి చక్రధర్ పర్యవేక్షించారు.


భవనం ప్రారంభిస్తున్న యడ్లపాటి స్వరూపరాణి. పక్కన కాంతారావు, సీతారామయ్య

నలుగురు పేకాట రాయుళ్లు అరెస్టు

కొల్లిపర: మండల పరిధిలోని చవలూరు నుంచి చక్రాయపాలెం వెళ్లే డొంక రోడ్డులో ఆదివారం రహస్యంగా పేకాడుతున్న నలుగురుని ఎస్ఐ కోటేశ్వరరావు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.44వేలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కోడిపందేలు వేస్తున్న ఐదుగురు అరెస్టు

కొల్లిపర: మండల పరిధిలోని తూములూరు నుంచి అనంతవరం వెళ్లే డొంక రోడ్డులో ఆదివారం కోడిపందేలు వేస్తున్న ఐదుగురిని ఎస్ఐ కోటేశ్వరరావు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.4వేలు, ఒక కోడి పుంజుని పట్టుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పంచారామాల బస్సులు ప్రారంభం

తెనాలిఅర్బన్: కార్తికమాసం పురస్కరించుకుని పంచారామాలు అయిన సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతిలకు శని, ఆదివారాల్లో ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, అసిస్టెంట్ మేనేజర్ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం రాత్రి ఏర్పాటు చేసిన పంచారామాల బస్సును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి శని, ఆదివారాల్లో బస్సులను నడుపుతున్నట్లు చెప్పారు. అలాగే శైవక్షేత్రాలు యాగంటి, మహానంది, శ్రీశైలంకు ప్రత్యేక బస్సులను భక్తుల కోరిక మేరకు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. శ్రీ కాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్‌కు ప్రత్యేక బస్సు సదుపాయాన్ని కూడా ఏర్పాటు చేశామన్నారు. శబరిమలై వెళ్లే అయ్యప్ప భక్తులకు వారి కోరికమేరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. తెనాలి, పరిసర ప్రాంత ప్రజలు ఈ సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.


పంచారామాలకు వెళ్తున్న బస్సు వద్ద ఏడీఎం ప్రసాద్

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ దరఖాస్తుల స్క్రూటినీ

తెనాలి: కృష్ణా-గుంటూరు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నిమిత్తం వచ్చిన ఫారం-18 దరఖాస్తుల స్క్రూటినీ ప్రక్రియ ప్రారంభమైంది. గ్రాడ్యుయేట్లు తమ దరఖాస్తుల సమర్పణకు ఈనెల 6వ తేదీతో గడువు ముగిసిన విషయం తెలిసిందే. దీనిపై అధికారులు స్క్రూటినీ ప్రక్రియను చేపట్టారు. పట్టణ మున్సిపాలిటీ పరిధిలో దాదాపు 12 వేలవరకు దరఖాస్తులు వచ్చినట్టు మున్సిపల్ కమిషనర్/ఎమ్మెల్సీ ఎన్నికల సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బండి శేషన్న ఆదివారం రాత్రి వెల్లడించారు. ప్రస్తుతానికి 500 వరకు దరఖాస్తుల స్క్రూటినీ పూర్తయిందని తెలిపారు. స్క్రూటినీ అనంతరం వీటిని ఆమోదం కోసం జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారికి పంపుతున్నట్టు వివరించారు.

వివాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

బొమ్మువానిపాలెం(కొల్లిపర): ఇసుక రేవులో జరిగిన వివాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయాలైన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. దీనిపై పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలో బొమ్మువానిపాలెం గ్రామంలో ఫ్రీ ఇసుక రీచ్‌లను గత మూడు రోజుల క్రితం ప్రారంభించారు. రీచ్ వద్దకు వచ్చిన ట్రాక్టర్లకు సీరియల్ నెంబర్లను అదే గ్రామానికి చెందిన తుమాటి రాజేంద్రప్రసాద్ వేస్తున్నాడు. వాటి ద్వారా కూలీలు లోడింగ్ చేస్తుంటారు. ఈ క్రమంలో ఇసుక లోడింగ్ విషయంలో స్థానిక గ్రామంలోని ట్రాక్టర్లలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని అదే గ్రామానికి చెందిన కిషోర్, చిన్నబాజి, అనీల్, అంజి, హరీష్ బాబులు రీచ్ వద్ద ఉన్న రాజేంద్రప్రసాద్‌తో వాదనకు దిగారు. ఇరువర్గాలకు తీవ్రస్థాయిలో వాదనలు జరిగాయి. ఈక్రమంలో రాజేంద్రప్రసాద్‌కు తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన రాజేంద్రప్రసాద్‌ను కొల్లిపరలోని ప్రాథమిక వైద్యశాలకు కుటుంబ సభ్యులు తీసుకురాగా అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అందించి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు.